క్లుప్తంగా

ఘనంగా ఆశా డే



సమావేశంలో మాట్లాడుతున్న గాంధీరెడ్డి

పూతలపట్టు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం ఆశాడే ఘనంగా జరుపుకున్నారు. ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ గాంధీరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆశావర్కర్లు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఏఎన్‌ఎంలను సమన్వయం చేసుకుని ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేలా చూడాల్సిన బాధ్యత ఆశవర్కర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ప్రవీణ, సిబ్బంది శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

బంగారుపాళెం: మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే వారపు సంత బహిరంగ వేలం వాయిదా వేసినట్లు సర్పంచ్ ఉమాదేవి, గ్రామ కార్యదర్శి శంకరయ్య గురువారం తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో దినసరి, వారపు సంత నిర్వాహణ (2023–2024)కు సంబంధించి గురువారం బహిరంగ వేలం చేపట్టినట్లు తెలిపారు. వేలం పాటకు తగినంత మంది గుత్తేదారులు హాజరు కాకపోవడంతో వేలంను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు వివరించారు.

తల్లీబిడ్డ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బంగారుపాళెం: తల్లీ బిడ్డ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో గురువారం ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో కౌమార దశలోని బాలికలు, గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భిణులకు ఆల్బెండజోల్ మాత్రలు, హైరిస్క్ గర్భిణులకు అందించాల్సిన వైద్యసేవలను వివరించారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ రేణుకాప్రభ, సిహెచ్‌ఓ షమీమ్ బేగం, హెల్త్‌సూపర్‌వైజర్లు భగవద్గీత, సుమతి పాల్గొన్నారు.

కారుమబ్బుల దోబూచులాట



పూతలపట్టు: మండలంలో కారుమబ్బులు దోబూచులాడుతూ వర్షపు రాకపై సంకేతాలందించాయి. గురువారం సాయంత్రం ఒక్కసారిగా మండల కేంద్రంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. మరి కొద్దిసేపట్లో వర్షం వస్తుందన్న ఆలోచన ప్రజల్లో రేకెత్తింది. కానీ రాత్రి 8 గంటల వరకూ వర్షం కురవలేదు.

19న సదుంలో గంగజాతర ప్రారంభం

సదుం: మండల కేంద్రం సదుంతో పాటు పలు గ్రామాల్లో ఈనెల 19, 20 తేదీల్లో గంగజాతర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం దున్నపోతుకు పూజలు నిర్వహించి ఊరేగించారు. 19 అర్ధరాత్రి నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించనున్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. సోమవారం సాయంత్రం చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగియనుంది.

16వేల పశువులకు గాలికుంటు టీకాలు

గుడిపాల: మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గల 17వేల పశువులకు గాలికుంటు(జడుపువ్యాధి) వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని మండల పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మండలంలోని నారగల్లు రైతుభరోసా కేంద్రం పరిధిలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగు నెలల వయసు దాటి ఉన్న పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ పావని పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న ఏహెచ్‌ఏ

కాణిపాకంలో దళారులకు చెక్



- వరసిద్ధుని ఆలయ ప్రాంగణంలో పీఆర్వో కార్యాలయం ప్రారంభం
- ఈ కార్యాలయంలోనే వీఐపీలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు

కాణిపాకం(యాదమరి): జిల్లాలో స్వయంభుగా వెలిసిన కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో దళారీలకు అధికార యంత్రాంగం చెక్ పెట్టింది. ఆలయ పునర్నిర్మాణం అనంతరం భక్తులకు తాకిడి పెరిగింది. నిత్యం సుమారు 15 వేల నుంచి 20వేల మంది వరకు భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తున్నారు. వీరితోపాటు వీఐపీలు తరలి వస్తున్నారు. ఈక్రమంలోనే వీఐపీల ముసుగులో దళారీలు చేతి వాటం చూపుతున్నారు. వీరందరికీ అడ్డుకట్ట వేసేలా ఆలయ పాలక మండలి, ఆలయ అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు వీఐపీలకు నేరుగా వీఐపీ గేటు నుంచి ఆలయంలో ప్రత్యేక దర్శనం కల్పించేవారు. ఈ నెల నుంచి వీఐపీలకు ప్రత్యేక మార్గంలో అధికార అనుమతులు మంజూరు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వీరి కోసం ప్రత్యేకంగా పీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేసింది. వీఐపీలందరూ అందులో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంది. దీంతో వీఐపీలు ఎంత మంది స్వామి వారి దర్శనానికి వస్తున్నారు. సామాన్యులు ఎంత మంది వస్తున్నారని స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ కారణంగా దళారులు ఆలయంలోనికి ప్రవేశించడానికి వీలు లేకుండా పోయింది.

ప్రారంభించిన శారద పీఠాధిపతి

విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ఈ నెల 5న ఆలయం ముందు ఈ పీఆర్వో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ రోజు నుంచి పీఆర్‌ఓ కార్యాలయం వద్ద ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వీఐపీలు నేరుగా అక్కడికి చేరుకుంటున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రత్యేక దర్శనాలు కొనసాగుతున్నాయి



స్వామివారి దర్శనార్థం వచ్చే వీఐపీలకు ప్రత్యేక దర్శనాలు కొనసాగుతున్నాయి. అయితే దర్శన ప్రక్రియలో స్వల్పంగా మార్పులు చేశాం. స్వామివారి ఆలయం ముందు పీఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేశాం. అక్కడకు వీఐపీలు వస్తే ఆలయ సిబ్బంది ద్వారా స్వామివారి ప్రత్యేక దర్శనాలు, తీర్థ ప్రసాదాలు అందచేస్తాం. వీఐపీలు, ఉభయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

దళారులకు అడ్డకట్ట వేశాం



స్వామివారి దర్శనాల్లో దళారులకు అడ్డుకట్ట వేశాం. ఉభయదారులు, వారి కుటుంబ సభ్యులు, వీఐపీలు నేరుగా పీఆర్‌ఓ కార్యాలయం వద్దకు వస్తే అక్కడి నుంచి వారికి స్వామివారి ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేస్తాం. అందరి వివరాలు అందులో నమోదు చేస్తాం. నేరుగా వీఐపీ గేట్ వద్దకు వెళితే ఎవ్వరు అక్కడ అనుమతించరు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని పీఆర్‌ఓ కార్యాలయం వద్దకు రావాలి.

-ఆలయ ఈఓ వెంకటేశు

వినాయకుని సేవలో సినీ నటుడు సత్యప్రకాష్



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు సత్యప్రకాష్ గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రింటర్స్ కార్యవర్గం

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు నగర ప్రింటర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. ఈ మేరకు కార్యవర్గ వివరాలను ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా రవిచంద్రారెడ్డి, కార్యదర్శిగా సురేష్‌బాబు, కోశాధికారిగా మాధవ, ఉపాధ్యక్షులుగా దయాలన్, సంయుక్త కార్యదర్శిగా ప్రభాకర్, ఈసీ మెంబర్లు నాగరాజు, ఇంద్రకుమార్, వెంకటేష్, రాజా, రెడ్డి కుమార్, శశికుమార్, సతీష్, బాబు, రవి, హరిబాబును ఎన్నుకున్నారు. వీరు రెండేళ్లపాటు పదవి కాలంలో ఉంటారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా ఒకరు హాజరుకాకపోగా 164 మంది పరీక్షలు రాశారు. ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు, మహిళా పోలీసులు ప్రతి ఒక్కరికీ కళాశాల వెలుపలే తనిఖీ చేసి పరీక్ష కేంద్రం లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

ఆలస్యం కాకూడదు

పూతలపట్టు: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఆలస్యం కాకుండా త్వరగా కేంద్రానికి చేరుకోవాలని ఎంపీడీఓ గౌరి సూచించారు. ఇంటర్మీడియట్ సెంకడియర్ పరీక్షలు గురువారం జరుగుతుండగా హాజరు పట్టీని పరిశీలించారు.



పరీక్ష కేంద్రంలో ఎంపీడీఓ గౌరి

125 మందికి గాను 121 మంది హాజరైనట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు సాగాలని ఎగ్జామినర్ సత్యనారాయణకు చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండాలని సూచించారు. పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు ఇంటికి చేరుకోవాలని తెలిపారు. అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి





చిత్తూరు పార్కులో... కాశిరాళ్ల పాఠశాలలో.. పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న భాషాభిమానులు

యాదమరి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఉపాధ్యాయులు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన తెలుగుభాష మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని అశువులు బాసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు రమేష్‌బాబు, భాస్కర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: నగరంలోని గంగినేని పార్కులో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆ విగ్రహ కమిటీ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. పార్కులోని అమరజీవి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర చౌదిరి, అరణకుమారి, సహదేవనాయుడు, నాగరత్నం, బాలక్రిష్ణారెడ్డి, రమేష్ బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు వేసవి దుక్కులు చేయడంలో చీడపీడలను నియంత్రించవచ్చని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం ఆముదాల పంచాయతీలో రైతులు సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దుక్కులు చేపట్టడానికి మార్చి, ఏప్రిల్ మాసాలు అనువైనవన్నారు. ఇప్పుడు దుక్కులు చేపట్టడం వల్ల వేరుకుళ్ల తెగులును కలిగించే సిలీంద్ర సిద్ధ బీజాలు నిరంతరం భూమి అడుగుభాగానే ఉంటాయని, వర్షం పడగానే విజృంభించిన పంటను నాశనం చేస్తాయన్నారు. అదేవిధంగా భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలని తెలిపారు. దీనివల్ల భూమి లోపల ఉన్న సిలీంద్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డి మూలాలు కూడా బయటకు పడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయన్నారు. వేసవి దుక్కులతో భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలాల్లో చల్లుకోవాలని తెలిపారు. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయన్నారు. మార్చి రెండు వారం నుంచి మే మొదటి వారం వరకు వేసవి దుక్కులు చేపట్టడానికి అనుకూలమని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్ నెడుంజేలన్, రైతులు పాల్గొన్నారు.

పూడికతీతతో భూగర్భ జలాల పెంపు

మండల పరిధిలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చేపడుతున్న చెరువుల్లో పూడికతీత పనులతో భవిష్యత్ తరాలకు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని ఉపాధిహామీ పథక సంచాలకులు గంగాభవానీ తెలిపారు. ఆమె గంగమాంబపురం పంచాయతీలో చెరువుల్లో జరుగుతున్న పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో ఆమె మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో చెరువులో చేస్తున్న నీటి కుంటల వల్ల జంతువులు, పశువులకు నీటి సౌకర్యం లభిస్తుందన్నారు. చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణ, రైతులకు సాగు నీటి వసతి, కూలీలకు ఉపాధి, మట్టి రవాణా ద్వారా వాహనదారులకు ఆదాయం వస్తుందన్నారు.

ఈ–క్రాప్ నమోదులో తప్పులుంటే సరిచేసుకోండి





ఐరాల: ఆర్‌బీకేలో ఈ–క్రాప్ వివరాలను పరిశీలిస్తున్న రైతులు, యాదమరి: వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ మధుసూదన్ రెడ్డి, అధికారులు

ఐరాల: మండలంలో రబీలో సాగులో ఉన్న 827 ఎకరాలకు ఈ–క్రాప్ నమోదు చేసినట్లు ఏఓ వరలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చినకాంపల్లె ఆర్బీకే కేంద్రం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు, ఏమైనా తప్పులు, మార్పులు చేర్పులు ఉంటే వెంటనే అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ నెల 17వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాలలో జాబితాలు అందుబాటులో ఉంటాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగులో అధికారుల సలహాలు అవసరం

యాదమరి: రైతులు పంటలు పండించే ముందు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాల్సిన అవసరముందని జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదన్ రెడ్డి రైతలకు సూచించారు. ఆయన గురువారం మండలంలోని కాశిరాళ్ల రైతు భరోసా కేంద్రం పరిధిలోని పెరుమాళ్ల పెంట గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సాగు చేసిన వరిపంటను ఆయన పరిశీలించారు. అనంతరం పంటలో వచ్చే చీడలను నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు సూచనలు అందించారు. రైతులతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల సలహా మేరకు పంటలు పండిస్తే నష్టం రాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ ఏఓ చరిత, రైతులు పాల్గొన్నారు.

డెంగ్యూపై ప్రజల్లో అప్రమత్తత అవసరం



తవణంపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక



బంగారుపాళెం: భవిత కేంద్రంలో దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వాతి

తవణంపల్లె: డెంగ్యూ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే మీటింగ్ నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ యుక్తవయసు బాలికలు కష్టపడి చదువుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, కుటుంబ నియంత్రణ చికిత్సలకు బాలింతలను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అరగొండ అపోలో హాస్పిటల్ ఏఓ చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్‌ఓ కమ్రుద్దీన్, పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాకాలం జాగ్రత్తలు తప్పనిసరి

గుడిపాల: ఎండాకాలంలో అందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే అస్వస్థతకు గురవుతారని పీహెచ్ వైద్యాధికారి ప్రవీణ్ హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బాలింతలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో ప్రయాణించేటప్పుడు గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఎండలకు శరీరంలోని నీళ్లంతా బయటకు వెళ్లిపోతుందని, ఈ క్రమంలో తక్షణ శక్తికోసం నిమ్మరసం, పంచదార నీరు, జ్యూస్ వంటివి తీసుకోవాలని చెప్పారు. డయేరియా బారిన పడిన వారంతా వైద్యారోగ్య సిబ్బందికి సమాచారం ఇచ్చి వైద్యసేవలు పొందాలని వివరించారు. ప్రస్తుతం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేయిస్తున్నామన్నారు. పీహెచ్‌సీలో అవసరమైన మందులు, అత్యాధునిక ల్యాబ్‌లు ఉన్నాయని, ప్రజలు పీహెసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గర్భిణుల వివరాలు తెలియజేయాలి

గ్రామాల్లో గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తెలియజేయాలని డాక్టర్ కుమార్ తెలియజేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాలన్నారు. బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. అనంతరం ఆశావర్కర్ల నెల సమాచారానికి సంబంధించి రికార్డులన్నింటినీ ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు నివేదికలను అందజేయాలని సూచించారు.

దంత సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

బంగారుపాళెం: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి దంతవైద్యురాలు డాక్టర్ స్వాతి సూచించారు. నేషనల్ ఓరల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దంతాలు(పళ్లు)సక్రమంగా శుభ్రం చేసుకోకపోతే వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. దంత సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఫిజియోథెరపీ డాక్టర్లు పుష్ప, భార్గవి, ఐఈ ఆర్‌పీలు హిమబిందు, మీరయ్య పాల్గొన్నారు.

మహిళా కూలీలకు సమాన వేతనాలు

చిత్తూరు రూరల్: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేసే మహిళా కూలీలకు వేతనాలు పురుషులతో సమానంగా ఇవ్వాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు నగరంలో తహసీల్దార్ పార్వతిని వారు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు, ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. పేద ప్రజలకు జీవనోపాధి కల్పించడంతో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టెలీనా, తులసి, ఈశ్వరి, జాయ్స్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని సరివిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ దమయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–2023 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. ఏపీజీపీసెట్ ఏపీసిఎఫ్‌ఎస్‌ఎస్.డాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినులు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులధ్రువీకరణపత్రం, ఆధార్, ఫోన్ నంబరు పొందుపరచాలని పేర్కొన్నారు.